## Info Cell

| **Publication** | Andhra Bhoomi | **Date** | 20.11.2015 |
|---|---|---|---|
| **Edition** | Hyderabad | **Page** | |

# నేటితో ముగియనున్న బాలల చిత్రోత్సవం

**★ చివరి రోజుల్లో కన్పించని పర్యవేక్షణ**
**★ ప్రసాద్ ఐమాక్స్‌కే పరిమితమైన సందడి**

**ఆంధ్రభూమి బ్యూరో**

హైదరాబాద్, నవంబర్ 19: భాగ్యనగరం వేదికగా వారం రోజుల నుంచి జరుగుతున్న 19వ అంతర్జాతీయ బాలల చిత్రోత్సవానికి శుక్రవారంతో తెర పడనుంది. నగరంలో పేరుగాంచిన ప్రసాద్ ఐమాక్స్, హైటెక్స్, ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియం, రవీంద్రభారతి, పారిపార కళాభవన్‌తోపాటు మొత్తం 13 థియేటర్లను ఎంపిక చేసి, అందులో సుమారు 170 దేశాలకు చెందిన 1208 చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. ఈ నెల 14వ తేదీన మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభించిన చిత్రోత్సవంలో రెండు రోజులుగా ఊపు తగ్గిందనే చెప్పవచ్చు. బాలలను ఆకట్టుకునే, వివిధ అంశాల్లో వారిని ప్రభావితం చేసేందుకు ఎంపిక చేసిన సినిమాలను ప్రదర్శించేందుకు ఎంపిక చేసిన థియేటర్లలో గురువారం నుంచి చిన్నారులు, విద్యార్థులు కన్పించలేదు. బాలల చిత్రోత్సవం కేవలం ప్రసాద్ ఐమాక్స్‌కే పరిమితమైంది. అక్కడ కూడా విదేశాల నుంచి వచ్చిన చిన్నారులకు తగిన గైడెన్స్ ఇచ్చేందుకు చేసిన ఏర్పాట్లు అంతంతమాత్రమేనని చెప్పవచ్చు. దీనికి తోడు పాతబస్తీలో ఎంపిక చేసిన రమా, అత్తాపూర్‌లోని ఈశ్వర్ వంటి థియేటర్లలో బాలల చిత్రోత్సవాలను వీక్షించేందుకు వచ్చే వారి సంఖ్య బాగా తగ్గింది. కానీ చివరి రెండురోజైన గురువారం ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియం, రవీంద్రభారతి, ప్రసాద్ ఐమాక్స్ వేదికల్లో కాస్త చిన్నారుల సందడి కన్పించింది. రెండేళ్లకోసారి జరిగే బాలల చిత్రోత్సవం గతంలో బాగా సందడిగా జరిగేదని, ఈసారి కూడా ప్రారంభమైన 14వ తేదీ నుంచి రెండురోజుల పాటు హడావుడి చేసిన నిర్వాహకులు ఆ తర్వాత కన్పించటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**పిల్లల్లో ప్రతిభను గుర్తించటంలో వెనకబడి ఉన్నాం: అల్లాణి శ్రీధర్**

పిల్లల్లోని ప్రతిభా, సృజనాత్మకతను గుర్తించటంలో మనం వెనకబడి ఉన్నామని తెలంగాణ జ్యూరీ చైర్మన్ అల్లాణి శ్రీధర్ అన్నారు. బీమగాని సుధాకర్ గౌడ్ నేతృత్వంలో రూపొందించిన బాలల చిత్రం నేడు ఐమాక్స్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలలతో ఆదిత్య చిత్రం రూపొందించటం సంతోషమని వ్యాఖ్యానించారు. ఇలాంటి చిత్రాలు మరెన్నో రావాలని ఆకాంక్షించారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆశయాలకు అనుగుణంగా రూపొందించిన ఈ చిత్రం అందరికీ స్ఫూర్తి ఇస్తుందని టీవీ ఫిల్మ్ నిర్మాతల సంఘం అధ్యక్షుడు పకీర్ అహ్మద్ అన్నారు. ప్రస్తుతం పిల్లల చిత్రాలు నిర్మించేవారికి సబ్సిడీ ఇవ్వడం లేదని వాపోయారు. కనీసం రూ.40లక్షలు సబ్సిడీగా ఇస్తే మంచి చిత్రాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. ఆదిత్య చిత్రానికి మంచి ఆదరణ లభించిందని, తొలిసారిగా పన్ను మినహాయించిన సినిమా ఆదిత్య కావటం ఆనందమని తెలిపారు. కార్యక్రమంలో నాగబాల సురేష్‌కుమార్, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

INTERNATIONAL CHILDREN'S FILM FESTIVAL
Hyderabad

**విజయవంతంగా చిత్రోత్సవ సాంస్కృతిక సంబరాలు**

ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న 19వ అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాలలో భాగంగా ఈనెల 15వ తేదీ నుండి రవీంద్రభారతిలో జరుగుతున్న సాంస్కృతిక సంబరాలు గురువారంతో విజయవంతంగా ముగిసాయి. ఉత్సవాలను తిలకించడానికి భాగ్యనగరానికి వచ్చిన తమిళ సినీ నటుడు మురగా నటరాజ్ మాస్టర్ బాలల నృత్య ప్రదర్శనను చూసి ఎంతో ఆనందించానని తెలిపారు. వారం రోజులుగా ఉదయం నుండి సాయంత్రం వరకు సంగీత, నృత్యాలలో వీనుల విందైన ప్రదర్శనలు ఇచ్చిన బాలలను అభినందించారు. కార్యక్రమాలలో ఎక్కువగా సినిమా సంగీతం కన్పించిందని, లలిత గీతాలకు, దేశభక్తిగీతాలకు ప్రాధాన్యత ఇస్తే బాగుండేదని అన్నారు. నమితా హైస్కూలు బాలలు ప్రదర్శించిన జాతీయ సమైక్యతా నృత్యం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సంగారెడ్డి బాలకేంద్రం విద్యార్థులు 'మేకిన్ ఇండియా' నృత్యంతోపాటు వికారాబాద్ సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన లంబాడ నృత్యం, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ బాలలు ప్రదర్శించిన దాండియా నృత్యం, సివంటర్ హైస్కూలు ప్రదర్శించిన నవదుర్గ నృత్యం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. గురువారం 18 పాఠశాలల బాల బాలికలు పాల్గొన్నారు. ఐదు రోజులుగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన 90 పాఠశాలల విద్యార్థులు ఈ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న చిత్రోత్సవాలను బాల బాలికలతోపాటు సంబంధిత ఉపాధ్యాయులు ఎంతో చాలెంజింగా తీసుకుని కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ ఉత్సవాలు చేసినా విమర్శలు రావడం సహజం కానీ బాలల ఉత్సవాలలో ఆడిటోరియంలో తప్ప బయట మరెక్కడా ప్రభుత్వ ప్రోత్సాహం లేదని కొంత మంది ఉపాధ్యాయులు వ్యాఖ్యానించగా, మరి కొంతమంది ఉపాధ్యాయులు మాట్లాడుతూ నృత్యంలో పాల్గొనడానికి దుస్తుల కోసం వెయ్యి రూపాయల నుండి 1500 రూపాయల వరకు వసూలు చేశారని తెలిపారు. నిజాలు తెలుసుకుని ఉత్సవాల పేరుతో డబ్బులు వసూలు చేసి నవారిపై చర్యలు తీసుకోవాలని, కార్యక్రమంలో పాల్గొన్న బాలబాలికల పేరెంట్స్ విజ్ఞప్తి చేశారు. నృత్య ప్రదర్శనల అనంతరం 'వామ్స్' బ్రిటిష్ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ చిత్రం 80 నిమిషాల పాటు సాగింది. ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ చలనచిత్ర పరిశ్రమ మండలి బాల బాలికలకు టిక్కెట్, వాటర్ ప్యాకెట్లు ఇస్తున్నామని ప్రకటించారు. కానీ, తమకు ఎవరికీ అందలేదని పాఠశాల అధ్యాపకులు తెలిపారు. ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో గురువారం కూడా బాల బాలికలకు పలు చిత్రాలను ప్రదర్శించారు.